క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోనిఅర్బన్: చల్లని మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. అవోపా అధ్యక్షుడు వంకదారి శ్రీనాథ్‌గుప్తా, కార్యదర్శి మిరియాల శ్రీధర్ సౌజన్యంతో స్థానిక మున్సిపల్ మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేయగా కమిషనర్ రామచంద్రారెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. మండు వేసవిలో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన ప్రజల దాహార్తి తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సభ్యులు శ్రీధర్, ప్రతాప్, ఈరన్న శెట్టి, రఘు, కిరణ్, ఏఎస్ఎం ప్రసాద్, వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బలగాల కవాతు



ఆదోనిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

ఆదోని అర్బన్: జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి ఆదేశాల మేరకు గురువారం టూ టౌన్ సీఐ గోపీచంద్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రానున్న జనరల్ ఎలక్షన్‌లో భాగంగా ప్రజల్లో భరోసా నింపేలా పట్టణంలోని భీమా సర్కిల్, ఫరీద్‌సాహెబ్ మొహల్లా, మట్కారీగేరి, చిన్నమార్కెట్, చాంద్ సా దర్గా మీదుగా ఎస్‌కేడీ కాలనీ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. ఎస్ఎస్‌బీ అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్, టూటౌన్ ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ..

ఆదోని రూరల్: గ్రామాల్లో ఎన్నికలు సజావుగా జరిగేందుకు, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్ర బలగాలు గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా గురువారం మండలంలోని కపటి, పెసలబండ, సుల్తానాపురం గ్రామాల్లో తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసుశాఖ కృషి చేస్తుందని సీఐ చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కేసులు నమోదు చేస్తామన్నారు. అల్లర్లు, గొడవలు సృష్టించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాకు తరలివచ్చిన భక్తులు



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు.

దరఖాస్తు చేసుకోండి

కోసిగి: స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ షబానా తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ 5వ తరగతి చదివి మానివేసిన పిల్లలు, గ్రామీణ ప్రాంతాల బాలికలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతో పాటు నాణ్యమైన భోజనం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. అలాగే ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఏప్రిల్ 4వ తేదీలోపు విద్యార్థుల తల్లిదండ్రులు ఆధార్ కార్డు, పాస్ ఫొటోలు, రేషన్ కార్డు, స్టడీ, కుల ధ్రువ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తుగ్గలి: మండలంలోని జీ.ఎర్రగుడి, ఉప్పర్లపల్లి, బొల్లవానిపల్లి, కడమకుంట్ల, పీ.కొత్తూరు, పగిడిరాయి, బాటతండ, రోల్లపాడుతండ, మిద్దెతండ తదితర పోలింగ్ కేంద్రాలను గురువారం ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు పని చేస్తున్నాయా? లేదా? అని తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఫర్నిచర్, ఓటర్లకు తాగునీరు, మరుగుదొడ్ల, క్యూలైన్ల ఏర్పాట్లపై సూచనలు చేశారు.

ఉప్పరహాల్.. అభివృద్ధి ఫుల్

- రూ.5కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు
- నాడు అంత్యక్రియలకు వాగు నీటిలో వెళ్లాల్సిన దుస్థితి
- నేడు.. వాగుపై రూ.15లక్షలతో వంతెన ఏర్పాటు
- కౌతాళం వరకు రూ.1.04కోట్లతో బీటీ రోడ్డు
- రూ.1.62 కోట్లతో ఉన్నత పాఠశాలలో 9 అదనపు గదులు
- రూ.11లక్షలతో ప్రహరీ నిర్మాణం
- రూ.8లక్షలతో ఇంటింటికీ కుళాయి
- డీబీటీ, నాన్ డీబీటీ కింద గ్రామస్తులకు రూ.16.93 కోట్ల లబ్ధి

కర్నూలు జిల్లాలో మారుమూల మండలంలోని చిన్న గ్రామం. రూపుదాల్చినప్పటి నుంచి పట్టించుకునే నాయకుడు, పాలకులు లేకపోవడంతో అభివృద్ధి ఏంటో ఎరుగకపోయింది. దీంతో సమస్యలు రాజ్యమేలేవి. కనీసం మృతదేహాలను ఖననం చేయాలన్నా నడుము లోతు నీటిలో నడుచుకుంటూ పొలాల్లో వెళ్లాల్సి వచ్చేది. వర్షా కాలంలో వారి అవస్థలు వర్ణనాతీతం. వాగుపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరినా ఎవరికీ పట్టలేదు.తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామాలను కలిపే, మండల కేంద్రానికి వెళ్లడానికి రోడ్లు లేవు. ఇక ప్రభుత్వ అధికారులు ఏదాదికోమారు వచ్చేవారు. ఇదంతా ఐదేళ్ల క్రితం.. ప్రస్తుతం ఉప్పరహాల్ గ్రామంలో రూ.5కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి గ్రామస్తుల ఇబ్బందులను తొలగించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.




నాడు: పెద్ద వంక నీటిలో అంత్యక్రియలకు మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం. నేడు : పెద్ద వంకపై నిర్మించిన బ్రిడ్జి



కౌతాళం: అభివృద్ధి దూరంగా చీకటిలో మగ్గిన గ్రామాలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రగతి పనులు చేపట్టి వాటిని వెలుగులోకి తెచ్చారు.50 సంవత్సరాలుగా జరగని పనులు చేపట్టడంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి దీనికి నిదర్శనం మండలంలోని ఉప్పరహాల్ గ్రామం. కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడంతో గ్రామంలో వసతులకు కొదువలేదు. సమస్యలు పరిష్కారం కావడంతో స్థానికులు సంతోషంగా జీవనం సాగిస్తున్నారు.

అభివృద్ధి పనులు ఇలా..

- గ్రామంలోని 400 ఇళ్లకు రూ.8లక్షలు ఖర్చు చేసి ఇంటింటికీ ఏర్పాటు చేశారు.
- ప్రధాన కాలనీల్లో రూ.40లక్షలతో సీసీరోడ్లు నిర్మించారు.
- ఉప్పరహాల్ నుంచి కామవరం రస్తాలో పొలాలకు పోవు రస్తా విషయంలో 1972లో హత్యలు జరగడంతో ఆ రస్తాలో ఎలాంటి పనులు జరగలేదు ప్రస్తుతం 4 కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డును రూ. 13లక్షలతో పూర్తి చేశారు.
- గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కావడంతో పాఠశాలకు 9 అదనపు గదుల కోసం ప్రభుత్వం రూ.1.62 కోట్లు మంజూరు చేయగా ఇటీవల పనులు పూర్తవడంతో ప్రారంభించారు.
- రూ. 40 లక్షలతో సచివాలయం భవనం ప్రారంభించారు.
- ఉప్పరహాల్ నుంచి కౌతాళం వరకు 4.3 కిలోమీటర్ల మేర రూ. 1.04 కోట్లతో బీటీ రోడ్డు వేశారు.
- ఉప్పరహాల్ నుంచి కుంటనహాల్ మరియు రౌడూరు వరకు రూ.1.60 కోట్లతో రోడ్డు నిర్మించారు.
- పంచాయతీ నిధులు రూ.4 లక్షలతో ఎస్ఎస్ ట్యాంకుకు మరమ్మతులు చేపట్టారు.
- ఉప్పరహాల్-బదినేహాల్ దారిలో పెద్దవంకపై మండల అభివృద్ధి నిధులు రూ.10లక్షలు, పంచాయతీ నిధులు రూ.5లక్షలతో బ్రిడ్జి నిర్మించారు.
- కర్ణాటక రాష్ట్రానికి వెళ్లే బర్గలదిన్నె రోడ్డును ఉపాధి నిధులు రూ. 8లక్షలతో పూర్తి చేశారు.
- గ్రామంలోని పాఠశాలను నాడు నేడు కింద రూ. 25 లక్షలతో ఆధునీకరించారు. అలాగే రూ. 11లక్షల ఉపాధి నిధులతో ప్రహరీ పూర్తి చేశారు.
- గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేసేందుకు ముగ్గురు స్వీపర్లను నియమించారు.
- పంచాయతీ కార్యాలయం ముందు భాగంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాంచారు.



ప్రారంభమైన సచివాలయం భవనం



ఇటీవల ప్రారంభమైన జెడ్పీ పాఠశాల నూతన భవనం

సంక్షేమ పథకాల లబ్ధి ఇలా.. (డీబీటీ)

పథకం	లబ్ధిదారులు	లబ్ధి చేకూరిన మొత్తం
జగనన్న అమ్మఒడి	347	1,60,74,600
జగనన్న విద్యా దీవెన	132	28,21,660
జగనన్న వసతి దీవెన	105	20,48,485
రైతు భరోసా	584	3,30,21,800
వైఎస్సార్‌ఉచిత పంటభీమా	492	1,82,70,065
వైఎస్సాఆర్ సున్న వడ్డీ (పంట రుణాలు)	183	6,43,338
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	11	63,700
వైఎస్సార్ పింఛన్ కానుక	351	3,43,56,000
వైఎస్సార్ చేయూత	179	35,43,750
వైఎస్సార్ ఆసరా	360	42,35,493
పొదుపు గ్రూపులకు సున్న వడ్డీ	553	21,18,237
వైఎస్సార్ కాపు నేస్తం	1	15,000
వైఎస్సార్ ఈబీసీ	8	2,25000
వైఎస్సార్ కళ్యాణమస్తు	1	1,00,000
ఆరోగ్య శ్రీ	72	18,51,090
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	40	1,60,750
ఇళ్ల నిర్మాణాలు	31	18,41,580
వైఎస్సార్ బీమా	9	8,60,000
వాహనమిత్ర	3	40,000
జగనన్న చేదోడు	7	1,30,000
వైట్‌కార్డు హోల్డర్ల సహాయం	656	6,56,000
జగనన్న తోడు	4	2,530
మొత్తం		12,81,79,079
పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ)		
ఇంటి స్థలాలు	39	95,94,000
జగనన్న విద్యా కానుక	335	25,21,210
8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ	41	5,42,102
జగనన్న తోడు రుణాలు	11	2,04,609
జగనన్న గోరుముద్ద	387	38,34,009
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	423	79,22,790
ఇంటింటికి రేషన్	756	1,65,14,064
మొత్తం		4,11,32,934

అంత్యక్రియలు చేసేందుకు అవస్థలు పడ్డాం



గ్రామంలో ఎవరు చనిపోయినా శ్మశానానికి వెళ్లడానికి పెద్ద వంక దాటి వెళ్లాల్సి వచ్చేది. వంతెన లేకపోవడంతో నీటిలో నడిచి వెళ్లేవాళ్లం. ఎన్నోసార్లు నాయకులు, అధికారులను వేడుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. గ్రామం ఏర్పడినప్పటి నుంచి చాలా ఇబ్బందులు పడ్డాం. జగనన్న వచ్చిన తరువాత బ్రిడ్జి కట్టించారు. ఇప్పుడు ఆ అవస్థలు లేవు. అలాగే.. కామవరం, కర్ణాటకకు వెళ్లే బర్గలదిన్నె ఆయకట్టు రస్తాలు గ్రావెల్ రోడ్లుగా మారాయి. మా గ్రామానికి దాదాపు కష్టాలన్నీ పూర్తయ్యాయి.

– ఈరన్న, గ్రామస్తుడు

గ్రామం కళకళలాడుతోంది



గ్రామంలో సిమెంటు రోడ్లు, కుళాయిలు ఏర్పాటు చేయడంతో పాటు చాలా పనులు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలతో గ్రామం కళకళలాడుతుంది. ఇప్పటి వరకు ఇన్ని పనులు ఎవరూ చేయలేదు. మాకే కొత్తగా కనిపిస్తుంది.

– రాగమ్మ



నాడు : పొలాల్లో కామవరం రస్తా



నేడు: మట్టి రోడ్డు ఏర్పాటు చేసిన దృశ్యం

'మేమంతా సిద్ధం' సభను జయప్రదం చేయండి

మంత్రాలయం : ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం పేరుతో చేపట్టిన బస్సుయాత్ర శుక్రవారం ఎమ్మిగనూరు చేరుకుంటుందని, ఈ సందర్భంగా అక్కడ నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుమార్తె ప్రియాంక రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రాఘవేంద్ర నగర్‌లో పర్యటించారు. ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జగనన్న నిర్వహించే సభకు నియోజకవర్గంలో అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమారెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, పెట్రోల్ బంక్ శివన్న, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాగవేంద్ర, సచివాలయ కోకన్వీనర్ రాఘవేంద్రాచారి, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ వెంకటేశ్ శెట్టి పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కోసిగి : ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో నిర్వహించే మేము సిద్ధం సభకు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం ఆయన మండల నాయకులతో కలిసి మాట్లాడారు. మండలంలోని 26 గ్రామాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. మంత్రాలయం మండలం నారాయణపురం వద్ద అక్రమంగా తరలిస్తున్న 10 బాక్సుల కర్ణాటక మద్యం (960 ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్ల)ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులు కోసిగికి చెందిన మధుకృష్ణ, నారాయణపురానికి చెందిన ఉరుకుందును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా వెంటనే తన సెల్ నెంబర్ 94409 02579కు ఫోన్/మెసేజ్ ద్వారా తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

విద్యార్థిని ప్రతిభ



దేవనకొండ: మండలకేంద్రానికి చెందిన ఆవుల హంస్సికవర్షిని మార్చి 10వ తేదీన నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్షలో జిల్లాస్థాయిలో 21వ ర్యాంకు, జోన్-4 స్థాయిలో 55వ ర్యాంకు సాధించింది. తద్వారా పత్తికొండలోని గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందింది. మొత్తం 50 మార్కులకుగానూ 47 మార్కులు సాధించింది. విద్యార్థి సీటు సాధించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ పనుల పరిశీలన

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్ సర్కిల్‌లో నిర్మితమవుతున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎంఈ చలపతిరావు, ఏఈలు గురువారం పరిశీలించారు. నిర్మాణం పనులు నాణ్యతగా చేపట్టాలని, నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. రూ.55 కోట్లతో మొదటి విడతగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు కమిషనర్ తెలిపారు. రెండేళ్లలో షాపింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణం పూర్తిచేయాల్సి ఉందన్నారు.

పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ

ఆదోని అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో బకాయిలు చెల్లించేందుకు ప్రజలకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జీవోఎంఎస్ నంబర్ 35 ఎంఏ ప్రకారం ఈనెల 29వ తేదీన రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాల్లో ఆస్తి, ఖాళీ స్థలం పన్ను బకాయిలు, పన్నుపై విధించిన వడ్డీని వన్ టైం సెటిల్‌మెంట్‌గా చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని తెలిపారు. పన్ను, బకాయి మొత్తాన్ని ఒకేసారి ఈ నెల 31వ తేదీలపు చెల్లించినట్లయితే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అశ్వవాహనంపై శ్రీవారు

మద్దికెర: పెరవలి రంగనాథుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారు సతీసమేతుడై అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం అశ్వ వాహనంపై పల్లకీలో స్వామివారిని ఉంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.

ఆడ పిల్లలను రక్షించుకుందాం

పెద్దకడబూరు : ఆడ పిల్లలను రక్షించుకుందాం.. సమాజాన్ని కాపాడుకుందామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వీరగోవిందమ్మ, విజయకుమారి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో గురువారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆడ పిల్లలను కాపాడుకోవడంతో పాటు వారికి సమాన హక్కులు పొందేలా చూడాలన్నారు. లింగవివక్ష చూపకుండా తల్లిదండ్రులు వారిని చదువులు చదివించేలా తెలియజేద్దామని చెప్పారు. బాల్య వివాహాలను అరికట్టేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పిల్లల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..

పిల్లల సంరక్షణ బాధ్యతాయుతంగా తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీనరసమ్మ, కిశోర్, శ్రీధర్, క్లారెన్స్ నైటింగేల్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో (ఎర్లీ చైల్డ్ డెవలప్‌మెంట్) పిల్లల పెంపకం, సంరక్షణపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, ఆరోగ్య సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 0 -6 సంవత్సరాల లోపు పిల్లల పెరుగుదల, మానసిక అభివృద్ధిపై ఆటల రూపంలో శిక్షణ ఇచ్చారు.



ఆటల రూపంలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఓటే వజ్రాయుధం

ఆదోని అర్బన్: ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిందని, ఎన్నికల్లో సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు ఉపయోగపడుతుందని, అందరూ కచ్చితంగా ఓటు వేయాలని ఆదోని వన్‌టౌన్ సీఐ తేజమూర్తి అన్నారు. గురువార రాత్రి పట్టణంలోని గణేష్ సర్కిల్ ప్రాంతంలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ఏప్రిల్ 15వ తేదీలోపు ఓటు హక్కుకు అర్హత కలిగి ఉండి ఓటర్ గుర్తింపు కార్డు రాని వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేవారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సోషల్ మీడియాలో అసభ్యకర, అభ్యంతరకర పోస్టులు పెట్టినా, చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.



గణేష్ సర్కిల్‌లో ప్రజలతో మాట్లాడుతున్న వన్ టౌన్ సీఐ తేజమూర్తి

సోషల్ మీడియా పోస్టులు శృతిమించొద్దు

- అసత్య ప్రచారాలపై కేసులు నమోదు
- సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి తప్పనిసరి
- వివాదస్పదమైన పోస్టులను ఫార్వర్డ్ చేసినా బాధ్యులే
- మార్గదర్శకాలను విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

ఆదోని సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు సామాజిక మాధ్యమాలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగామ్ తదితర యాప్‌లలో శృతి మించి అసత్య ప్రచారాలు చేస్తే పోలీసులు కేసులు నమోదు చేయడంతో పాటు జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం సోషల్ మీడియాకు కూడా ఎలక్ట్రానిక్ మీడియా మాదిరిగానే నిబంధనలు విధించింది.

సోషల్ మీడియాలో ప్రచారం పెయిడ్ న్యూస్ కిందికే..

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆయా పార్టీల నేతలు వెచ్చిస్తున్న ఖర్చు వివరాలను ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెయిడ్ న్యూస్ కిందికే వస్తుంది. దీంతో సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం చేస్తే ఈ ఖర్చు అంతా అభ్యర్థి ఎన్నికల ఖాతాలోకి వెళ్తుంది.



తప్పుడు పోస్టులను ఫార్వర్డ్ చేసినా నేరమే

ఆయా గ్రూపులలో వచ్చిన పోస్టులను పరిశీలించకుండా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వాట్సప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఫార్వర్డ్ చేసినా, పోస్టింగ్ చేసినా వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అందుకే ఏదైనా ఫార్వర్డ్ చేసేముందు ఒకటికి రెండుసార్లు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి.

గ్రూప్ అడ్మిన్‌దే బాధ్యత

సోషల్ మీడియా గ్రూప్‌లలో వివాదాస్పద పోస్టులు, కామెంట్లు వంటివి పెట్టినా వెంటనే డెలీట్ చేయాలి. ఎందుకంటే పోస్టింగ్ చేసిన సభ్యుడితో పాటు గ్రూప్ అడ్మిన్ కూడా ఇందుకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో గ్రూపు సభ్యులు ప్రస్తుతం ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాల్సి ఉంటుంది. పోలింగ్ సమయానికి 48 గంటలు ముందుగానే సోషల్ మీడియాలో ప్రచారం నిలిపివేయాల్సి ఉంటుంది.

అధికారులు నిఘా : ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఫొటోలు మార్ఫింగ్, అశ్లీల చిత్రాలు, సందేశాలు పంపినా ఐటీ యాక్ట్-2000 ప్రకారం సెక్షన్-67 కింద జైలుశిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. సోషల్ మీడియాపై అధికారుల నిఘా ఉంటుంది. ఏది పడితే ఆ పోస్టులను ఫార్వర్డ్ చేయడం మంచిది కాదు. నేరం రుజువైతే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తారు.

సామాజిక మాధ్యమాలకు మార్గదర్శకాలు ఇలా..

- పోటీ చేసే అభ్యర్థులు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా పార్టీలపై, సంస్థలు, అధికార యంత్రాంగంపై అసత్య ప్రచారం చేయకూడదు. అభ్యర్థులపై కార్టున్స్, మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా అసత్య ప్రచారం చేసినట్లు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే పోలీసులు, ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.
- ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ప్రచారం చేయకూడదు. చట్ట విరుద్ధమైన ప్రకటనలు చేస్తే రాజ్యాంగ ఉల్లంఘన కిందికి వస్తుంది.
- తప్పుడు ప్రచారం చేస్తే ఐపీసీ-504, 505 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసే అవకాశం ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల ప్రచారాల్లో భాగంగా సోషల్ మీడియా జిల్లా, రాష్ట్ర స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి తప్పనిసరిగా పొందాల్సిఉంటుంది.

మూగజీవుల దాహం తీర్చండి

పెద్దకడబూరు : మండలంలోని మూగజీవుల దాహార్తిని తీర్చాలని ఫోరమ్ ఫర్ ఆర్టీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బొగ్గుల తిక్కన్న కోరారు. ఈ మేరకు గురువారం ఆదోని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) శైలేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పెద్దకడబూరు మండలంలోని ఎల్ఎల్‌సీ పరిధిలో ఉన్న 1ఆర్, 76ఆర్ బ్రాంచ్ కాలువలకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్షాభావంతో మండలంలోని కుంటలు, చెరువులు, వాగులు, వంకలు ఎండిపోయాయన్నారు. భూగర్భజలాలు సైతం అడుగంటిపోయాయన్నారు. మండలంలో సుమారు 2వేలకు పైగా గెర్రెలు, మేకలు, వెయ్యికి పైగా మూగజీవాలు ఉన్నాయని వాటికి తాగేందుకు నీరు కరువైందని, బ్రాంచ్ కాలువలకు నీటిని వదిలితే వాటికి అనుసంధానంగా ఉన్న వాగులు, కుంటలు నీటితో నిండి మూగజీవులు తాగునీరు దొరుకుతుందన్నారు. స్పందించిన ఈఈ ఏప్రిల్ 11వ తేదీ వరకు ఎల్ఎల్‌సీలో నీరు పారుతుందని 4వ తేదీ నుంచి బ్రాంచ్ కాలువలకు నీటిని వదులుతామని హామీ ఇచ్చారు. కమిటీ సభ్యుడు సురేష్‌బాబు, ఆనందరాజు ఉన్నారు.

శ్రీరంగనాథుడి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మద్దికెర: శ్రీరంగనాథుడి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని తాత్కాలిక, శాశ్వత హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలు, ఇతర ఆదాయాన్ని గురువారం లెక్కించగా రూ.22,17,652 సమకూరినట్లు కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఏసీ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో హుండీ లెక్కించడం జరిగిందన్నారు. స్వామి వారి చదివింపుల ద్వారా రూ.3,68,178, సేవా టికెట్ల ద్వారా రూ.2,45,690, పర్మినెంట్ హుండీ ద్వారా రూ.9,66,742 తాత్కాలిక హుండీ ద్వారా రూ.6,37,042 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గతేడాది రూ.19,81,654 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.2,35,998 పెరిగినట్లు వివరించారు. అర్చకులు రంగస్వామి, సిబ్బంది రఘు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

ఆలూరు: ఆలూరు నియోజకవర్గం పరిధిలోని 297 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆర్‌ఓ డి.రామునాయక్ ఆదేశించారు. ఆయన గురువారం హాలహర్వి, చింతకుంట, మొదేహాళ్, నిట్రవట్టి, శిరుగాపురం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం, ర్యాంపులు తదితర సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని బీఎల్ఓలు, అధికారులను ఆదేశించారు.